క్లుప్తంగా

వినాయకుని సేవలో పురుషోత్తమ భారతి



స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ ఏఈఓ, అధికారులు, వేదపండితులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక రాష్ట్రం శివగంగ శృంగేరి మఠం పురుషోత్తమ భారతిస్వామి దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



ఐరాలలో కురుస్తున్న వర్షం

ఐరాల: ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు నిప్పులు చెరిగాడు. మధ్యాహ్నం 2 గంటలపైన వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు.. ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఎండకు తీవ్ర ఇబ్బంది పడిన ప్రజలు ఈ వర్షానికి కాసింత ఉపశమనం చెందారు. ఈదురు గాలులకు మామిడి, అరటి పంటలకు కొంతమేర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మామిడికాయలు నేలరాలాయి. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అశ్వవాహనంపై ఇంద్రవరుదుడు



అశ్వవాహనం నుంచి భక్తులను కటాక్షిస్తున్న స్వామివారు

యాదమరి: స్థానిక ఇంద్రవరద స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సోమవారం రాత్రి ఇంద్రవరదుడు స్వామి అశ్వవాహనంపై భక్తులను కటాక్షించారు. రాత్రి స్వామివారు పురవీధులలో ఊరేగుతుండగా భక్తులు స్వామివారికి టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మోదీ పాలనపై ప్రచారం



సమావేశంలో బీజేపీ నాయకులు

చిత్తూరు రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 9 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, ఇందులో భాగంగా నెల పాటు ప్రచారం చేస్తామని బీజేపీ రాష్ట మీడియా ప్రతినిధి కోలా ఆనంద్ తెలిపారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. జాతీయ హైవేల నిర్మాణం, విమానాశ్రయాలు. రైల్వేస్టేషన్ల విస్తరణ, కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథక నిధుల ద్వారా పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు, ఇన్‌చార్జ్ రఘురామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, నాయకులు సి.బాబు. బ్రహ్మానందరెడ్డి, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' ఆధ్వర్యంలో నేడు చిత్రలేఖనం పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు. నగరంలోని తపోవనం పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు నిర్వహిస్తారు. 1వ తరగతి నుంచి 7 వరకు చదివే విద్యార్థుల ఎవరైనా పాల్గొని తమ ప్రతిభ చాటుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

కోలాహలంగా గంగజాతర



గంగమ్మకు తొలిపూజ చేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే బాబు



గుడిపాల: అంబలి పోస్తున్న మహిళలు

–తొలిపూజలో పూతలపట్టు ఎమ్మెల్యే బాబు

చిత్తూరు రూరల్: మండలంలోని పిల్లారిమిట్టలో మంగళవారం గంగజాతర వేడుకగా నిర్వహించారు. జాతరకు వంశపారంపర్య ధర్మకర్తగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వ్యవహరించి తొలిపూజను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తెర తొలగించి అమ్మవారికి గజమాల సమర్పించారు. అనంతరం కర్పూర హారతి ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యంగా అంబలి సమర్పించారు. రాత్రి గ్రామస్తులంతా ఊరేగింపుగా వచ్చి కుంభ నైవేద్యం సమర్పించారు. ఆ తర్వాత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో గంగజాతరను ఘనంగా నిర్వహించారు. వసంతాపురం, కుప్పిగానిపల్లె, కమ్మతిమ్మాపల్లె దళితవాడలో గ్రామస్తులు ఉదయం గంగమ్మకు ఉదయం అభిషేకం, పూజలు చేశారు. అంబలి పోసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. గ్రామాల్లో వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు.

గ్రామాల్లో జాతర సందడి

బంగారుపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతర సందడి ప్రారంభమైంది. తగ్గువారిపల్లె, ఆర్‌ఆర్ నగర్, మొగిలివెంకటగిరి, దిగువరాగిమానుపెంట తదితర గ్రామాల్లో జాతర సందర్భంగా అమ్మవారికి ఉదయం అంబలి, పొంగళ్లను సమర్పించారు. రాత్రి అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించి బుధవారం తెల్లవారుజామున ప్రత్యేక మండపాల్లో కొలువుదీర్చి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి అమ్మవారిని నిమజ్జనానికి తరలించనున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు.

మొగిలి గ్రామంలో..

మండలంలోని మొగిలి గ్రామంలో తిరుపతి గంగమ్మ జాతర కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం అంబలి, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. అనంతరం గంగమ్మ శిరస్సును గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



మొగిలి గ్రామంలో అమ్మవారి శిరస్సును ఊరేగిస్తున్న భక్తులు



గుడిపాల: కుప్పిగానిపల్లెలో అమ్మవారికి పూజలు



బంగారుపాళెం: రాగిమానుపెంటలో



బంగారుపాళెం: ఆర్‌ఆర్ నగర్‌లో...

ప్రజల నమ్మకానికి నాలుగేళ్లు

- నవరత్నాలను కాపీకొట్టి మహానాడులో ప్రకటించిన బాబు
- టీడీపీ పాలనలో ఇచ్చిన హామీలకే దిక్కు లేదు
- వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలన సంబరాల్లో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజాదరణతో గెలిచి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయ్యిందని, తమ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆకాంక్షలకు మించి జగనన్న పరిపాలన చేస్తున్నారని ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నాలుగేళ్ల పాలనపై మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలను జగనన్న సీఎం అయ్యాక 98 శాతం తీర్చారన్నారు. టీడీపీ పాలనలో ఇచ్చిన 600 హామీల్లో 20 శాతం కూడా తీర్చలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ప్రతిపక్షనేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఓర్వలేక అడుగడుగునా అడ్డం పడుతున్నారని విమర్శించారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా విద్యాబోధన అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. చంద్రబాబు తమ నవరత్నాలను కాపీ కొట్టి, పేరు మార్చి, అదే పథకాలను మహానాడులో ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏవో 2, 3 పథకాలు కొత్తగా ప్రకటించారని, అయితే గతంలో ఇచ్చిన హామీలకు దిక్కులేదని, ఇక కొత్త పథకాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి 2.30 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ప్రతినెల 1వ తేదీనే ఇళ్లవద్దకే పింఛన్లు ఇస్తున్నామన్నారు. సిఫార్సులకు దూరంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. టీడీపీకి కాలం చెల్లిందని, ఇదే వారికి చివరి మహానాడు అని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞాన జగదీష్ నాయకులు త్యాగ, శ్రీధర్‌రెడ్డి, అప్పు, నారాయణ, సయ్యద్, కోలాకిరణ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల వద్ద వేగంగా సదుపాయాల కల్పన



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పూనేపల్లె వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహాల సముదాయం వద్ద మౌలిక వసతులను వేగంగా కల్పిస్తున్నట్టు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అరుణ కలెక్టర్ షన్మోహన్‌కు వివరించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కలెక్టర్ నిర్వహించిన వీడియో సమావేశంలో కమిషనర్ పాల్గొని టిడ్కో గృహ సముదాయ నిర్మాణంపై మాట్లాడారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని ఆమె చెప్పారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేకంగా రుణాల మంజూరు, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. వీడియో సమావేశం అనంతరం ఇదే విషయమై అధికారులతో కమిషనర్ చర్చించారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

సోమల: బాల్య వివాహాల నిరోధానికి ఐసీడీఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అమాస కుసుమ కుమారి అన్నారు. మంగళవారం ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. పొదలగుంటపల్లె ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణం రెడ్డి అంగన్‌వాడీల ద్వారా అందజేస్తున్న పథకాలు, పౌష్టికాహారం వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలన్నారు. వైస్ ఎంపీపీ ప్రభాకర మాట్లాడుతూ లేవుట్ వన్ లో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులు దృష్టిసారించాలని తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు సావిత్రమ్మ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నట్లు దృష్టికి వచ్చిందని, వాటర్ షెడ్ పథకంలో భాగంగా ఏ వర్కులు వచ్చాయో కూడా తెలపడం లేదని సభ దృష్టికి తెచ్చారు. మండల కేంద్రం బస్‌షెల్టర్ వద్ద ఉన్న మద్యం షాపును ఊరి చివరకు మార్చాలని సభ్యులు కోరారు. సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా, ఎంపీడీఓ నాగరాజ, తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు విత్తనాల పంపిణీ

పూతలపట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 2023-24 ఖరీఫ్ సీజనుకు సంబంధించిన వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఏఓ మధురవాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేతుల మీదుగా విత్తనకాయలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 10.30 నిమిషాలకు కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలియజేశారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతుభరోసా సిబ్బంది, రైతులు హాజరు కావాలని కోరారు.

గుడిపాలలో 'ఫ్యామిలీ డాక్టర్'



మాట్లాడుతున్న డాక్టర్ కఠారి కుమార్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇళ్ల వద్దకే వైద్యసేవలు చేరువయ్యాయని గుడిపాల వైద్యాధికారి కఠారి కుమార్ అన్నారు. మంగళవారం గుడిపాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, అలాగే బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్స చేయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్యం ఎలా ఉందో ఆరా తీశారు. సలహాలు-సూచనలు ఇచ్చారు. వైద్య సిబ్బంది లత, ప్రవీణ్, సింధుజ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ సుమన్

యాదమరి: మానవ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సుమన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన పత్రపల్లె దళితవాడ గ్రామస్తులకు మానవ హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు తమకు ఎలాంటి సమస్యలు వచ్చినా సంబంధిత అధికారులకు తెలపాలని సూచించారు. నేరుగా వచ్చి కలవాలన్నారు. మధ్యవర్తుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపన

– ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): మాస్టర్‌ప్లాన్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మంగళవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ సమావేశం మందిరంలో పాలక మండలి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం చైర్మన్, ఈఓ విలేకరులతో మాట్లాడుతూ స్వామివా రి ఆలయంలో నిత్యాన్నదానం కార్యక్రమంలో భాగంగా వీలైనంత ఎక్కువమంది భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే మాస్టర్ ప్లాన్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలకు దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. దాతల సహకారంలో జలప్రసాదం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 100 అడుగుల రహదారిలో ఆర్చి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వేసవిలో భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో వారికి తాగు నీరు, మజ్జిగ, అన్నప్రసాదం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు మారుతీశ్వర్ రావు, కొండయ్య, సుశీల, రామసుబ్బమ్మ, ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరి మాధవ రెడ్డి, హేమమాలిని, పర్యవేక్షకులు శ్రీధర్‌బాబు, కోదండపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

విజయపురం (నగరి) : ఆంధ్రా- తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న విజయపురం మండలంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేశారు. ఏఎస్ఐ లోకనాథం మంగళవారం గాండ్లకండ్రిగ చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే వాహన రికార్డులను పరిశీలించారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. రోడ్డు రవాణా నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా మహా కుంభాభిషేకం



గంగా జలంతో ఊరేగింపుగా వస్తున్న ఆలయ నిర్వాహకులు, భక్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కుమ్మర వీధిలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీ అగస్త్రీశ్వర స్వామి ఆలయంలో గంగా జల స్వీకరణ అనంతరం మహా కుంభాభిషేక, ప్రధాన కలశ పూజలను, రాత్రి హోమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తులసీరాం, శ్రీనివాసులు, సురేష్ బాబు, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా చక్రస్నానం



ఉత్సవమూర్తులు



త్రివేణి సంగమంలో చక్రస్నానం

– ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

యాదమరి: మండల కేంద్రమైన యాదమరిలో వెలసిన ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం స్వామివారికి తీర్థవారీ(చక్రస్నానం)ను ఆలయ అర్చక, వేదపండితులు వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవర్లను ప్రత్యేకంగా అలంకరంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం కల్యాణ వేదికలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయం ముందు మూడు నదులు కలిసే చోట ఏర్పాటు చేసిన పచ్చటి పందిళ్ల కింద శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు ఉత్సవమూర్తులకు, చక్రంకు చక్రస్నానం నిర్వహించగా, అనంతరం భక్తులు పుణ్యతీర్థంలో స్నానం ఆచరించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. రాత్రి ఉత్సవమూర్తులను పుణ్యకోటి విమానంలో పురవీధుల్లో మేళతాళాలతో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. రాత్రి శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించడంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా ముగిశాయి.

నేడు పుష్పపలకి సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నుంచి పుష్పపల్లకి సేవను నిర్వహించనున్నట్లు ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

స్ఫూర్తినింపుతూ..



'వ్యసనం' చిత్రం



శ్మశానానికి దారి అంశంపై వేసిన చిత్రం



దామోదర ఆచారి

యాదమరి: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాదమరి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దామోదర ఆచారి గీసిన పలు చిత్రాలు ఆలోచనలు రేకెత్తించాయి. 'వ్యసనం-సర్వనాశనం' అనే అంశాన్ని వివరిస్తూ తైలవర్ణ చిత్రంలో ధూమపానం మనిషిని సర్వనాశనం చేస్తుందని, ఊపిరితిత్తులు పాడైపోవడం క్యాన్సర్‌కు గురికావడం, కుటుంబం బలయ్యే విధానంపై తను చిత్రం గీశాడు. అలాగే 'శ్మశానానికి దారి' అనే విషయంపై నీటి రంగుల చిత్రంలో పొగాకు రక్కసి కోరల్లో ప్రపంచం చిక్కుకుని తగలబడి పోతుందని, నరకానికి మెట్టుగా మారి శ్మశానానికి దారి చూపిస్తుందని, ఆరోగ్య హరణేగానీ ఎదుగుదల ఉండదని చాటి చెప్పేలా చిత్రాలను గీశారు. ఇవి అందరినీ ఆలోచింపజేసేలా ఉన్నాయి.

అన్నదానం

పలమనేరు: పట్టణ సమీపంలోని వృద్ధాశ్రమంలో ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ఆయన అభిమానులు అన్నదానం చేశారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, రెడ్డి సంఘం నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.